సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం | 21 | ఆగస్టు | 2024



అన్నదాన భవనానికి విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయ ఆవరణలో నిర్మిస్తున్నఅన్నదాన భవనానికి కె.రత్నసంపత్, సమత దంపతులు (ఏలూరు జిల్లా గౌరవరం) రూ.51,116 అందజేశారు.



వెండి వస్తువుల సమర్పణ

మలికిపురం: మండలంలోని గూడపల్లిలో నూకాలమ్మకు కానూరి సురేష్, అనూష దంపతులు కేజీ వెండితో ఖడ్గం, వెండి చేయి చేయించి సమర్పించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 2,92,154 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది. ఖరీఫ్ సాగు కోసం డెల్టా కాలువలకు 14 వేల క్యూసెక్కులు విడిచిపెట్టారు.

న్యూస్‌రీల్

యూనివర్సిటీ ఖ్యాతి పెంచాలి



మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ రామ్మోహనరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): యూనివర్సిటీ స్థాయి మరింత పెంచాలని, రాబోయే తరాలకు విద్యావృక్షంలా తయారు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.రామ్మోహనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ 16 వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. రామ్మోహనరావు మాట్లాడుతూ రీసెర్చ్ సెంటర్లు మరిన్ని ఏర్పాటుచేసి విద్యార్థులను పరిశోధన వైపు ప్రోత్సహించాలన్నారు. జేఎన్‌టీయూకే వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఉన్నత విద్యలో పరీక్షా విధానం, మెథడాలజీ, బోధన పద్ధతులు, పాఠ్య ప్రణాళికలో తీసుకురావలసిన మార్పులపై దృష్టి సారిస్తున్నామన్నారు. కాకినాడ సీపోర్టు సీఈఓ మురళీధర్ మాట్లాడుతూ వర్సిటీ ద్వారా సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. వర్సిటీ అనుబంధ కళాశాలలకు ఉత్తమ ఫెర్మార్మెన్స్ అవార్డులతో పాటు ఐపీఎస్ అధికారి ఎంవీఆర్ కృష్ణతేజకు యంగ్ అచీవర్ అవార్డు అందజేశారు. రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ రవీంద్ర, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ కూల్చివేసిన కూటమి నాయకులు



పాలమూరులో జేసీబీతో బస్‌షెల్టర్‌ను కూల్చివేస్తున్న దృశ్యం

పెదపూడి: అనపర్తి మండలం పాలమూరు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తండ్రి గంగిరెడ్డి, తల్లిపేరు మీద ఉన్న బస్‌షెల్టర్‌ను కూటమి నాయకులు మంగళవారం జేసీబీతో దౌర్జన్యంగా కూల్చివేశారు. దీంతో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కూటమి నాయకులు దౌర్జన్యంగా బస్‌షెల్టర్ కూల్చివేయడంపై ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాలమూరు గ్రామంలో తూర్పు పేటలో 20 ఏళ్ల క్రితం టీడీపీ హయాంలో జన్మభూమి గ్రామ సభల్లో నిర్ణయం మేరకు 30శాతం ప్రజావిరాళం (కాంట్రిబ్యూషన్)తో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తన తండ్రి గంగిరెడ్డి పేరుమీద ఈ నిర్మాణం చేపట్టారు. అప్పట్లో సూర్యనారాయణరెడ్డి మూడు బస్‌షెల్టర్లు నిర్మాణానికి సుమారు రూ.లక్ష విరాళం ఇచ్చి వాటిని నిర్మించారు. అప్పటి నిబంధనల ప్రకారం ప్రజా విరాళం ఇచ్చినవారి పేర్లతో బస్‌షెల్టర్ నిర్మించుకోవచ్చు. అప్పటి టీడీపీ ఎమ్మెల్యే దివంగత నల్లమిల్లి మూలారెడ్డి హయాంలో నిర్మాణాలు చేపట్టారు. పాలమూరులో రెండు, చిన్న పాలమూరులో ఒకటి నిర్మించారు. ఈ బస్‌షెల్టర్లను ప్రయాణికులు వినియోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పాలమూరు తూర్పుపేట వద్ద బస్‌షెల్టర్‌ను దౌర్జన్యంగా కూటమి నాయకులు కూల్చివేశారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ఆయన తండ్రి పేరు మీద ఉన్న కట్టడాన్ని కూల్చివేయడమే లక్ష్యంగా పరిపాలన సాగుతోందా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

రొయ్య రయ్..



- ధరకు రెక్కలు
- ఐదేళ్ల తర్వాత పెరిగిన వైభవం
- కౌంట్‌కు రూ.50 నుంచి 60 వరకూ అధికం
- వరదలు, తెగుళ్లతో తగ్గిన సాగు
- ఉన్న వాటికి డిమాండ్



సాక్షి అమలాపురం: వెనామీ సాగుకు పూర్వ వైభవం వచ్చింది. రొయ్యల ధరలకు రెక్కలు వచ్చాయి. గడిచిన నెల రోజుల్లో కౌంట్‌కు కేజీకి రూ.50 నుంచి రూ.60 వరకు పెరిగాయి. సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు సాగు చేసిన చోట వాతావరణ మార్పుల వల్ల తెగుళ్ల సోకి పంట దెబ్బతినడంతో అంచనాలకు మించి ధరలు పెరిగాయని రైతులు చెబుతున్నారు.

వెనామీ సాగు అధికం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో వెనామీ సాగు అధికంగా ఉంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు కాకినాడ జిల్లాలో సుమారు 25 వేల ఎకరాల వరకూ ఉంటుందని అంచనా. గడిచిన నెల రోజులుగా రొయ్యల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుత మార్కెట్‌లో కీలకమైన వంద కౌంట్ (కేజీకి 100 రొయ్యలు) ధర కొనుగోలుదారులు రూ.260గా నిర్ణయించారు. మార్కెట్‌లో పోటీ కారణంగా కేజీకి మరో రూ.10 పెంచి కొనుగోలు చేస్తున్నారు. అలాగే 90 కౌంట్ రూ.270 నుంచి రూ.280 వరకు, 80 కౌంట్ రూ.280 నుంచి రూ.290 వరకు, 70 కౌంట్ రూ.300 నుంచి రూ.310ల వరకు, 60 కౌంట్ రూ.320 నుంచి రూ.330 వరకు, 50 కౌంట్ రూ.340 నుంచి రూ.350 వరకు, 40 కౌంట్ రూ.375 నుంచి 385 వరకు, 30 కౌంట్ రూ.470 నుంచి రూ.480 వరకు ఉంది. రొయ్యల కొనుగోలుదారులు నిర్ణయించిన ధర కన్నా రూ.పది అదనంగా చేసి కొంటున్నారు.

ఎగుమతుల జోరు

జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు రొయ్యల ఎగుమతి జోరుగా సాగుతుండడంతో వెనామీ ధరలు పెరిగాయి. కానీ డిమాండ్‌కు తగిన విధంగా రొయ్యలు అందుబాటులో లేవు. 100 కౌంట్ నుంచి 70 కౌంట్ మధ్యలో ఉన్న వెనామీ రొయ్యలు చైనాకు అధికంగా రవాణా జరుగుతుండగా, అంతకన్నా తక్కువ కౌంట్ అంటే 60 నుంచి 30 కౌంట్ మధ్య రొయ్యలు అమెరికాతో పాటు యూరప్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయని చెబుతున్నారు.

తెగుళ్ల బెడద

కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో గోదావరి నదీపాయలను ఆనకుని అనధికార ఆక్వా సాగు జరుగుతోంది. వరదలకు భయపడి ఇక్కడ జూలై నెలాఖరు నాటికి పట్టుబడులు వచ్చేలా చూసుకుంటారు. ఈ ఏడాది జూలై 20కి వరదలు రావడం వల్ల రైతులు నష్టాలను చవిచూశారు. దీని వల్ల కూడా సాగు తగ్గింది. ఇదే సమయంలో సాగు చేసిన చోట ఈ ఏడాది తెగుళ్ల తీవ్రత అధికంగా ఉంది. వెనామీ రొయ్యలకు వైట్ స్పాట్, వైట్ గట్ వంటి తెగుళ్లు, హెచ్‌పీ వల్ల రొయ్యల్లో ఎదుగుదల లోపం వంటి కారణాలతో దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఎంతగా అంటే రెండు జిల్లాలకు కలిపి రోజుకు సగటున 400 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడిగా వచ్చి కొనుగోలు కేంద్రాలకు వచ్చేది. కానీ ఇప్పుడు రోజుకు 150 టన్నులు కూడా మార్కెట్‌కు రావడం లేదు. ఈ కారణాల వల్లే వెనామీకి ధరలు పెంచడం మినహా మరో మార్గం కొనుగోలుదారులకు లేకుండా పోయింది. మార్కెట్‌ను గుప్పెట పెట్టుకుంటే అసలుకే మోసం వస్తోందనే కారణానికి తోడు, అనుకూల ప్రభుత్వానికి రైతులలో కొంత సానుకూలత రావాలనే ఉద్దేశంతో ధరలు పెంచారని రైతులు చెబుతుండడం విశేషం.

దెబ్బతీసిన తెగుళ్లు

ఇటీవల రొయ్యల కొనుగోలుదారులు సిండుకేటుగా మారి ధరలు తగ్గించడం పరిపాటిగా మారింది. టీడీపీకి అనుకూలంగా ఉండే కొనుగోలుదారులు ధరలను తగ్గించడం ద్వారా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి చెడ్డ పేరును తీసుకురావడానికి యత్నించారు. ధరలు తగ్గిన ప్రతి సందర్భంలోనూ గత ప్రభుత్వం కలుగజేసుకుని కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పీ) ప్రకటించి రొయ్యలు కొనుగోలు చేయించింది. కరోనా తర్వాత నుంచి అంతర్జాతీయంగా ఎగుమతుల తగ్గుదల చోటు చేసుకుని ఆ ప్రభావం ధరలపై పడింది. 100 కౌంట్ ధర కేజీ రూ.210 నుంచి రూ.230 మధ్యలో ఉండేది. సిండికేటు కొనుగోలుదారులకు భయపడి కొందరు రైతులు సాగుకు దూరమయ్యారు. మరికొందరు పూర్తి స్థాయిలో రొయ్యలను పెంచలేదు. హైటెక్ పద్ధతిలో సాగు చేసే రైతులు ఎకరాకు గరిష్ఠంగా లక్ష వరకు రొయ్య పిల్లలను సాగు చేస్తుంటారు. అటువంటి వారు కూడా ఎకరాకు 70 వేల రొయ్యలకు మించి సాగు చేయలేదు.



వెనామీ రొయ్యలు

కౌంట్ రకం	ధర (రూ.లలో)
30	470
40	375
50	340
60	320
70	300
80	280
90	270
100	260

సాగు విస్తీర్ణం తగ్గడమే కారణం

సాగు విస్తీర్ణం తగ్గడం వల్లే రొయ్యలకు ధర పెరిగింది. ఇప్పుడిప్పుడే సాగు మొదలు పెట్టినా డిసెంబర్, జనవరి వరకు దిగుబడి వచ్చే అవకాశం లేదు. అప్పటి వరకు మార్కెట్‌లో వెనామీ రొయ్యలకు ధర అధికంగానే ఉంటుంది.

– బి.రాంబాబు, ఆక్వా రైతు, అమలాపురం

కలెక్టర్ ఫొటోతో వాట్సాప్ సందేశాలు



కలెక్టర్ ఫొటోతో ఉన్న వాట్సాప్ నంబర్

అమలాపురం రూరల్: కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని జిల్లాలోని అధికారులకు, ఇతరులకు గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్ సందేశాలు పంపిస్తున్నారు. వారితో చాటింగ్ చేస్తూ సంభాషణ కొనసాగిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ మహేష్ కుమార్ మంగళవారం ప్రకటన విడుదల చేరారు. వాట్సాప్ లో చూపిస్తున్న 947855 66071 నంబర్ తనది కాదని స్పష్టం చేశారు. ఎవ్వరూ ఆ నంబర్ నుంచి మెసేజ్‌లకు స్పందించవద్దని, ఫోన్ కాల్స్‌ను స్వీకరించవద్దని తెలిపారు.

పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ పూర్తి

అమలాపురం టౌన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ దాదాపు పూర్తయ్యిందని డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. వాటిని విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకుంటున్నారా అనే విషయాన్ని తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. అలాగే కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కూడా ఆరా తీయాలన్నారు. మలికిపురం మండలం కేశనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకుడు లేని కారణంగా గెస్ట్ లెక్చరర్ ఫ్యాకల్టీ నుంచి దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. బోధన చేసిన గంటకు రూ.150 చొప్పున నెలకు రూ.10 వేల మించకుండా గౌరవ భృతి ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఆసక్తి కలవారు ఈ నెల 24వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తులను ఆ కళాశాలలో సమర్పించాలన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

అల్లవరం: రైతులు తాము పండించే పంట వివరాలను ఈ–క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసు బాబు సూచించారు. బెండమూర్లంక గ్రామంలో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1.52 లక్షల ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయన్నారు. 64 వేల ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు జరిగిందని, ఈ నెల 31 లోపు వంద శాతం పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 15లోగా ఈ–క్రాప్ నమోదు చేసిన పంటకు రైతుల ఈ–కేవైసీని నమోదు చేయాలన్నారు. అనంతరం ప్రతి గ్రామ సచివాలయంలో డ్రాఫ్ట్ జాబితాను ప్రదర్శించి, రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలన్నారు. అల్లవరం మండలంలో 2,380 ఎకరాల్లో వరినాట్లు పూర్తి కాగా, 1,650 ఎకరాల్లో పంట వివరాలు నమోదు జరిగినట్లు తెలిపారు. వరిని కుళ్లు తెగులు ఆశించకుండా హెక్సాకోనోజోల్ మందును పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఏడీ షంషీ, వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, విస్తరణాధికారి శివమోహన్, సర్పంచ్ బర్రే సీతారత్నం, రైతులు ఉన్నారు.

జిల్లాకు 57 లక్షల ఉపాధి పనిదినాలు

- సమన్వయంతో లక్ష్యాన్ని చేరుకోవాలి
- అధికారులతో కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులను గుర్తించి నివేదిక ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఉపాధి హామీ పనులపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల్లో ఉపాధి హామీ పనులు కింద చేయడానికి అవకాశం ఉన్న పనుల వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఉపాధి హామీ పథకం కింద 57 లక్షల పని దినాలను లక్ష్యంగా ఇచ్చారని, వాటిని చేరుకునేలా పనులను గుర్తించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. మెటీరియల్, లేబర్ కాంపోనెంట్ల కింద జిల్లాలో 266 రకాల పనులను చేపట్టవచ్చన్నారు. ఆగస్టు 23న రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో ప్రత్యేక సభలు నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో గ్రామ సభలకు కనీసం 30 శాతం మంది ప్రజలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏపీవోలు, ఏపీడీలు ముందుగానే సమావేశమై ప్రస్తుతం జరుగుతున్న, జరగబోయే పనుల ప్రణాళిక రూపొందించుకుని గ్రామ సభలలో ఆమోదం తీసుకోవాలనన్నారు.



ఉపాధి పనులపై మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ మధుసూదన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి బీవీ రమణ పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రసాద్ పథకంలో దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం దేవదాయ ధర్మాదాయ శాఖపై సమీక్షించారు. జిల్లాలో దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలు, వాటిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు తదితర వాటిపై ఆరా తీశారు. జిల్లాలో సుమారు 216 ఎకరాల దేవాలయ భూములు ఆక్రమణకు గురయ్యాయని అధికారులు తెలపగా, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్ద మొత్తంలో ప్రసాదాలు తయారు చేస్తున్న దేవాలయాలలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి నాణ్యతను పరీక్షించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవో జి.కేశవవర్ధన్ రెడ్డి, జిల్లా దేవదాయ ధర్మాదాయశాఖ అధికారి ఎం.లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ మనోహర్, అంతర్వేది ఈవో సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

జిల్లాలో ముఖ్యమైన ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోని రికార్డు రూమ్‌లను సీసీ టీవీ కెమెరాల ద్వారా పర్యవేక్షించే దిశగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ అన్నారు. ఈ విషయంపై మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులు, ఎస్ఎన్ఆర్ ఈ–డేటా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లోని (తహసీల్దార్) రికార్డు రూమ్‌లు, సంక్షేమ హాస్టళ్లు, ఇసుక రీచ్‌లు, ఇసుక నిల్వ కేంద్రాలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం ద్వారా పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.



అమలాపురంలో మంగళవారం ఉదయం కురుస్తున్న వర్షం

కుండపోత.. ఉక్కపోత..

సాక్షి, అమలాపురం: వాతావరణం చాలా విచిత్రంగా మారింది. ఎప్పుడు ఎండ కాస్తుందో, ఎప్పుడు వాన పడుతుందో తెలియడం లేదు. వేసవిని తలదన్నేలా ఎండ కాస్తూ ప్రజలను భయపెడుతోంది. అంతలోనే చల్లని చినుకులు సేదతీర్చుతున్నాయి. అమలాపురంలో మంగళవారం గంట పాటు ఏకదాటిగా వర్షం పడింది. ఏకంగా 18.2 మీమీ కురిసింది. ఉదయం పది గంటల నుంచి పదకొండు గంటల వరకు కురిసిన వర్షంతో సామన్యులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి భానుడు విజృంభించాడు. విపరీతమైన ఎండతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.



మధ్యాహ్న సమయంలో ఎండ కారణంగా తగ్గిన జనసంచారం

కల్యాణ వైభోగమే..



రత్నగిరిపై పెళ్లిళ్ల కోసం సిద్ధం చేసిన మంటపాలు

- రత్నగిరిపై జోరుగా వివాహాలు
- నేటి నుంచి మూడు రోజుల పాటు భారీ ముహూర్తాలు
- సత్రం గదులు 70 శాతం రిజర్వ్
- శ్రావణంలో ఇప్పటికే 500 పెళ్లిళ్లు

అన్నవరం: పెళ్లి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత అపూర్వ ఘట్టం. ఆ కార్యక్రమం తమ ఇష్ట దైవం సన్నిధిలో జరగాలని చాలామంది కోరుకుంటారు. అన్నవరంలోని వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం వివాహాలకు పెట్టింది పేరు. ఇక్కడ ఏటా వేల సంఖ్యలోవివాహాలు జరుగుతాయి. మంచి ముహూర్తాల సమయంలో ఈ సంఖ్య భారీగా పెరుగుతుంది. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో రత్నగిరిపై వివాహాల సందడి మొదలైంది.

నూతన దంపతులతో కళకళ

నూతన దంపతులతో సత్యదేవుని ఆలయ ప్రాంగణం కిటకిటలాడుతోంది. వివిధ ప్రాంతాల నుంచి కూడా నూతన వధూవరులు స్వామివారి దర్శనానికి తరలివస్తున్నారు. వీరందరూ వ్రతాలను ఆచరించి, స్వామివారిని దర్శించుకుని తమ జీవితం సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నారు. సత్యదేవుని సన్నిధిలో ఏటా ఐదు వేల జంటలు వేదమంత్రాల సాక్షిగా ఒక్కటవుతున్నాయి. **వీరితో బాటు ఎక్కడెక్కడో వివాహాలు చేసుకున్న మరో పది వేల జంటలు సత్యదేవుని సన్నిధికి విచ్చేస్తున్నాయి.**

పెళ్లిళ్ల సీజన్

శ్రావణ మాసం ప్రారంభమైన తర్వాత ఇప్పటి వరకూ సత్యదేవుని సన్నిధిలో ఐదు వందలకు పైగా వివాహాలు జరిగాయి. ఆగస్టు ఐదు నుంచి శ్రావణ మాసం ప్రారంభం కాగా ఏడో తేదీ నుంచి వివాహాలు మొదలయ్యాయి. ఈ నెల 15వ తేదీ ఒక్క రోజే వందకు పైగా జరిగాయి. మిగిలిన రోజుల్లో పది నుంచి ఇరవై వరకూ జరుగుతున్నాయి. 18, 19వ తేదీలలో దాదాపు 50 జంటలు ఒక్కటయ్యాయి.



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న దంపతులు (ఫైల్)

నేటి నుంచి భారీ సంఖ్యలో..

రత్నగిరిపై బుధవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకూ భారీ సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ఈ మూడు రోజులూ రత్నగిరిపై సత్రం గదులలో దాదాపు 70 శాతం, అన్ని వివాహ మండపాలను పెళ్లి బృందాలు రిజర్వ్ చేసుకున్నాయి. ఇదే ముహూర్తానికి పెళ్లిళ్లు పెట్టుకున్న మిగిలిన వారందరూ మంటపాలు లభ్యం కాక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

సర్దుబాటు చేయ'లేఖ'

రత్నగిరిపై వివాహాల నేపథ్యంలో సత్రం గదులు, అతిథి గృహాల కోసం భారీ డిమాండ్ ఏర్పడింది. కొండపై ఉన్న 600 వసతి గదులలో దాదాపు 70 శాతం రిజర్వ్ అయిపోయాయి. వాటికి సంబంధించి చార్జులు కూడా సిద్ధమయ్యాయి. మిగిలిన గదుల కోసం విపరీతమైన పోటీ ఏర్పడింది. కొండకు వచ్చే భక్తులు, పెళ్లి బృందాలు గదుల కోసం ప్రముఖ రాజకీయ నాయకులు, వీఐపీల సిఫారసు లేఖలను తీసుకువస్తున్నారు. ఈ వ్యవహారం దేవస్థానం అధికారులకు తలనొప్పిగా మారింది. గదులను సర్దుబాటు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

జనసేన పార్టీ నాయకుల వాగ్వాదం



సమావేశంలో వాదులాడుకుంటున్న జనసేన నాయకులు

అమలాపురం టౌన్: జనసేన నాయకుల మధ్య నెలకొన్న వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. వివరాల్లోకి వెళితే.. కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగిక దాడి, హత్య ఘటనలను ఖండించేందుకు అమలాపురం ప్రెస్ క్లబ్‌లో స్థానిక జనసేన నాయకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. అయితే తమకు సమాచారం గానీ, ఆహ్వానం గానీ లేదంటూ సమావేశాన్ని నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకులపై ఇద్దరు నాయకులు ధ్వజమెత్తారు. దీంతో సమావేశానంతరం వారి మధ్య వాగ్వాదం, గందరగోళం చోటుచేసుకుంది. అరుపులు, కేకలతో కొద్దిసేపు నాయకులు వాదులాడుకున్నారు. ఆది నుంచి అమలాపురం నియోజకవర్గ జనసేన పార్టీలో నెలకొన్న విభేదాలు ఈ సమావేశం రూపంలో మరోసారి వెల్లడయ్యాయి.

23న అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23న అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఉదయం 8 గంటల నుంచి అండర్ 14, 16, 18 విభాగాలలో పరుగుపందెం, జంపింగ్, త్రో బాల్ తదితర వాటిలో బాలురు, బాలికలను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి కలవారు అర్హతా పత్రాలతో హాజరుకావాలని కోరారు.

కామెర్ల మందు పంపిణీపై కొట్లాట

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామం కామెర్ల వ్యాధిని తగ్గించే మందుకు ప్రసిద్ధి అని అందరికీ తెలిసిన విషయమే. ఇక్కడ పూర్వం నుంచీ వంశపారంపర్యంగా కామెర్ల మందును ప్రజలకు అందిస్తున్న కుటుంబానికి పోటీగా మరో కుటుంబం వచ్చింది. దీంతో వారి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఒకరిపై మరొకరు దుష్ప్రచారాలు చేసుకునే క్రమంలో ఈ నెల 18న కొట్లాటకు దారి తీసింది. ఇరు వర్గాలు తమను అవతలి వర్గం గాయపరిచారిందంటూ రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్సకు చేరారు. దీంతో ఆసుపత్రి సమాచారం మేరకు ద్రాక్షారామ ఎఎస్సై డీవీవీ రమణారావు సోమవారం రాత్రి కేసులు నమోదు చేశారు. ఆనాల శ్రీను, ఆనాల మణికంఠ స్వామి నాయుడు తనను కొట్టి గాయపరిచారంటూ కొటారి రమణ అనే మహిళ ఫిర్యాదు చేయగా, ఆచంట దుర్గ, కొటారి రమణ, నంగి ధనలక్ష్మిలు పాముల వీరభద్రరావు, చక్రధరరావు, గుండుబోగుల లక్ష్మణరావు ప్రోత్సాహంతో తనను కొట్టారంటూ కవల కనకదుర్గ ఫిర్యాదు చేసింది.

ఉల్లిక్కిపడుతూ..

- సెంచరీ దిశగా దూసుకువెళ్తున్న ఉల్లి
- ప్రకృతి వైపరీత్యాలతో తగ్గిన దిగుబడి
- మార్కెట్‌లో రూ.70 చేరుకున్న ధర
- గత ప్రభుత్వంలో రాయితీపై విక్రయాలు

ఆలమూరు: ఉల్లి పాయలను కోస్తే కన్నీరు వస్తుందంటారు కాని, ఇప్పుడు కొంటేనే వస్తోంది. ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదంటారు కాని, ఉల్లి ధరలను నియంత్రించి మేలు చేయాలని ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం తరచూ ఉల్లి ధరలు పెరిగిపోతూ వస్తున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో నష్ట నివారణ చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏ సమయంలోనైనా ఉల్లి ధరలు పెరిగితే వినియోగదారులకు సత్వర స్వాంతన చేకూర్చే విధంగా రైతు బజార్లలో రాయితీపై ఉల్లిని విక్రయించేవారు. ప్రస్తుతం ధరలు పెరుగుతున్నా ఎవరూ పట్టించుకోక సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. దీంతో కూరల్లో ఉల్లి వినియోగాన్ని సాధ్యమైనంత వరకూ తగ్గించుకునే పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లోని కాకా హోటల్ ఉంచి ఫైవ్‌స్టార్ హోటల్ వరకూ ఉల్లిని అపురూపంగా వాడుకుంటున్నారు.

చర్యలు లేక.. ధర దిగక

దైనందిన జీవితంలో ప్రధానంగా వినియోగించే నిత్యావసరాల్లో ఒకటైన ఉల్లి ధర తరచూ పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి, సామాన్య ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది. ఉల్లి ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే వాదన వినిపిస్తోంది. ఉల్లి ఎగుమతులను నిషేధించడంతో పాటు నాఫెడ్‌లోని ఉల్లి నిల్వలను మార్కెట్‌లోకి అందుబాటులోకి వెంటనే తీసుకురావడంతోనే ఉల్లి ధరల నియంత్రణ సాధ్యమవుతుందని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. అలాగే పెరిగిన ధరలను సాకుగా చూపి రిటైల్ మార్కెట్‌లో ధరలను ఇష్టానుసారం విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ధరల పెరుగుదల ముందుగానే ఊహించి నిల్వ చేసిన వ్యాపారులకు మాత్రం లాభాల పంటను పండిస్తుంది.



చొప్పెల్ల మార్కెట్‌కు వచ్చిన ఉల్లిపాయల లారీ

పెరుగుదల ఎందుకంటే..

ఈ ఏడాది ప్రథమార్థంలో వేసవి తీవ్రత, ద్వితీయార్థంలో వర్షాలు, వరదలతో ఉల్లిని ఎక్కువగా సాగు చేసే మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో పంట తీవ్రంగా దెబ్బతింది. రాష్ట్రంలో ఉల్లి ఎక్కువగా పండించే కర్నూలులో సాగు విస్తీర్ణం ప్రతి ఏటా తగ్గిపోవడం, అదే క్రమంలో ఎగుమతులు భారీగా పెరిగిపోవడం తదితర కారణాలతో కొరత ఏర్పడి ధరల పెరుగుదలకు కారణం అవుతోంది. కొత్త పంట అందుబాటులోకి రాకపోవడంతో పాటు పాత నిల్వలు తగ్గిపోతుండటం ధరలపై ప్రభావం చూపుతుంది.



ఉమ్మడి తూర్పు గోదావరిలో..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతి రోజు సగటున సుమారు 900 టన్నుల ఉల్లి వినియోగం జరుగుతోంది. రాజమహేంద్రవరం, మడికి, రావులపాలెం, చొప్పెల్ల, రాజోలు, అమలాపురం తదితర హోల్‌సేల్ మార్కెట్‌లకు నిత్యం సుమారు 50 లారీల్లో ఉల్లి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నుంచి దిగుమతి అవుతుంది. పెరిగిన ధరల దృష్ట్యా సుమారు 20 లారీల్లో రోజుకు కేవలం 500 టన్నులు మాత్రమే దిగుమతి కావడం కూడా ధరలు పెరుగుదలకు కారణమవుతుంది. దీంతో పాటు రాష్ట్రంలో కర్నూలు మినహా ఎక్కువగా ఉల్లి సాగు లేకపోవడంతో దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో హోల్‌సేల్ వ్యాపారుల వద్ద ఉల్లి నిల్వలు గణనీయంగా తగ్గడంతో డిమాండ్‌కు సరఫరాకు తీవ్ర వ్యత్యాసం ఏర్పడి ఉల్లి ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈనెల ప్రారంభంలో రిటైల్ మార్కెట్‌లో రూ. 25లు ఉన్న నాణ్యమైన ఉల్లి ధర ప్రస్తుతం రూ.70కు చేరుకుంది. చిరు వ్యాపారులు ఆటోలపై ఇళ్ల వద్దకు వచ్చి కొంచెం నాసిరకంగా ఉన్న ఉల్లిపాయలు రెండు కిలోలు రూ. 100కు విక్రయిస్తున్నారు.

బంగాళాదుంపలూ అంతే..

పశ్చిమ బెంగాల్ నుంచి దిగుమతి చేసుకుంటున్న బంగాళాదుంపలు కూడా ఉల్లి ధరల మాదిరిగానే రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటి వరకూ కిలో రూ.30 పలికిన ధర ప్రస్తుతం రూ.50కు చేరుకుంది. ఆ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలతో పంట తీవ్రంగా దెబ్బతింది. ప్రస్తుతం కొత్త పంట అందుబాటులోకి రాకపోవడం, ఇప్పటి వరకూ ఉన్న నిల్వలు మాత్రమే వినియోగించడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతుంది. దీంతో ఏటా బంగాళాదుంపల సాగు తగ్గుతుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

ఇంచుమించు ఇలానే..



ఉల్లి దిగుమతులు రోజు రోజుకూ తగ్గిపోవడంతో జిల్లాలో ధరల పెరుగుదలకు కారణమైంది. ఇతర రాష్ట్రాల్లో ఈనెలాఖరు నాటికి గాని కొత్త పంట అందుబాటులోకి రాదు. అప్పటి వరకూ ప్రస్తుతం ఉన్న ధర ఇంచుమించు ఉండే అవకాశం ఉంది.

–సాపిరెడ్డి సాయి, హోల్‌సేల్ వ్యాపారి, చొప్పెల్ల

విక్రయాలు తగ్గిపోయాయి



ఉల్లి ధరలు పెరిగిపోవడంతో విక్రయాలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. కూరగాయల ధరలు కూడా ఇదే విధంగా ఉండటంతో వ్యాపారాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. మార్కెట్‌కు అంచనాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యాపారం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

–చెల్లుబోయిన సింహాచలం, మడికి, ఆలమూరు మండలం

గొల్లప్రోలులో పిచ్చికుక్క స్వైరవిహారం

- పది మందిపై దాడి
- పరుగులు తీస్తూ పడిపోయి మరో 15 మందికి గాయాలు

పిఠాపురం: గొల్లప్రోలులో పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. సుమారు పది మందిపై దాడి గాయపరిచింది. దాని నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీస్తూ పడిపోయి మరో 15 మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. గొల్లప్రోలు పీహెచ్‌సీకి మంగళవారం వైద్య సేవల కోసం రోగులు వచ్చారు. వారిలో ఒకరిపై పిచ్చి కుక్క దాడి చేసింది. విచక్షణా రహితంగా కరిచేందుకు ప్రయత్నించింది. దీంతో అక్కడి వారందరూ భయంతో పరుగులు తీశారు. ఈ క్రమంలో 15 మంది పడిపోయి గాయపడ్డారు. వారందరికీ పీహెచ్‌సీలో వైద్య చికిత్స అందించారు. అనంతరం గొల్లప్రోలు నగర పంచాయతీలోని ఎస్సీపేట, ప్రభుత్వ ఆసుపత్రి, రంగప్ప చెరువు, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పిచ్చి కుక్క విచ్చలవిడిగా తిరుగుతూ జనాలను పరుగులు పెట్టించింది. ఈ క్రమంలో గొల్లప్రోలుకు చెందిన జి.సందీప్, ఆర్.తాతయ్య, టి.మణెమ్మ, రాజకుమార్, రాజ్యలక్ష్మి తదితర పది మందిని కరిచింది. వారందరూ పిఠాపురం సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఆ కుక్క ఎప్పుడు, ఎలా దాడి చేస్తోందనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.



గొల్లప్రోలులో ప్రజలపై దాడి చేసిన పిచ్చి కుక్క

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి – కాపవరం గ్రామాల మధ్యలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చోడి వీరబాబు (17) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బూరుగుపూడి దేవుడి మాన్యానికి చెందిన చోడి వీరబాబు తన ఇద్దరు స్నేహితులతో కలిసి మోటారు సైకిల్‌పై వెళుతున్నాడు. ఆ సమయంలో బండి ముందు బ్రేకు వేయడంతో చివర్లో కూర్చున్న వీరబాబు రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయమై, తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బండి నడుపుతున్న మహేష్, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై బి.సత్యనారాయణ తెలిపారు.



వీరబాబు (ఫైల్)

వీరబాబు మృతిపై తల్లి అనుమానం

వీరబాబు మృతిపై అనుమానం ఉన్నట్టు అతడి తల్లి మంగ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త శ్రీను పెట్రోలు బంక్‌లో పనిచేస్తారని, రెండో కుమారుడు వీరబాబు పదోతరగతి వరకూ చదువుకుని పెయింటింగ్ పనులు చేస్తున్నాడని తెలిపింది. తన కుమారుడిని స్నేహితులిద్దరూ తీసుకువెళ్లారని, ఈ ప్రమాదంపై అనుమానం వ్యక్తం చేసింది. బండిని నడిపిన మహేష్ పరారీలో ఉండడం గమనార్హం.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ..

కరప: కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి మృతి చెందాడు. కరప మండలం అరట్లకట్ట గ్రామానికి చెందిన ఏడిద శేషగిరిరావు(55)ను పది రోజుల క్రితం రాత్రి సమయంలో ఇంటిలో నిద్రిస్తుండగా కుడి కాలుపై పురుగు కుట్టింది. దాన్ని గోకడంతో పుండుగా మారిపోయింది. దీంతో కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీన ఇంటి దగ్గర ఫిట్స్ రావడంతో 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కరప ఎస్సై టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాశీ అన్నపూర్ణ సత్రం అదనపు కార్యదర్శిగా గాంధీ



అన్నవరం: ఉత్తరప్రదేశ్‌లోని వారణాశిలో గల కాశీ అన్నపూర్ణ సత్రం అదనపు కార్యదర్శిగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడు పేరూరి గాంధీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ఆయనను ఆ సత్రం కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. గాంధీ గతంలో అదే కాశీ అన్నపూర్ణ సత్రం సభ్యుడిగా, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సేవలందించారు. అలాగే షిరిడీ, తిరుపతి, శ్రీశైలంలోని ఆర్యవైశ్య సత్రం సభ్యుడిగా కూడా పనిచేస్తున్నారు. దాదాపు 30 ఏళ్లుగా స్థానిక ఆర్యవైశ్య సత్రంలోని వివిధ పదవుల్లో కొనసాగుతున్నారు. సత్యదేవుని ఆలయానికి విచ్చేసే వైశ్య సామాజిక వర్గీయులతో పాటు ఇతర సామాజిక వర్గాల వారికీ సత్రం ద్వారా సేవలు చేస్తున్నారు.

ఆరువేల లీటర్ల బెల్లపుఊట ధ్వంసం

కొవ్వూరు: ఔరంగబాద్‌కి ఎదురుగా గోదావరి మధ్యలో ఉన్న గోంగూరలంకలో సారాబట్టీపై సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని, ఆరు వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. రాజమహేంద్రవరంలోని తాడితోటకు చెందిన దుర్గ ఈ సారాబట్టీ నిర్వహిస్తున్నాడని, అయితే అతడు పరారీ అయినట్లు తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

కొవ్వూరు: పట్టణంలోని రాజీవ్ కాలనీలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై మంగళవారం దాడి చేసినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. నిర్వాహకురాలు చింతల లక్ష్మిని అరెస్ట్ చేశామన్నారు. బయటి ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్టు గుర్తించామన్నారు. రాజమహేంద్రవరం, వైజాగ్‌కు చెందిన ఇద్దరు యువతలను విడిపించనట్టు తెలిపారు.

యువకులకు తీవ్ర గాయాలు

తొండంగి: మోటారు సైకిల్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏ.కొత్తపల్లి గ్రామానికి చెందిన వెలుగు కృష్ణ, పేరపు శ్రీను, మరోయువకుడు కలిసి గ్రామానికి దగ్గరలోని కోదాడ వెళ్లే రహదారిలో ఉన్న జగ్గారావు బీడు కాలనీకి వెళుతున్నారు. కాలనీకి చేరుకునే మలుపు వద్ద వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో శ్రీను, కృష్ణకు తీవ్ర గాయాలు కాగా, మరో యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన యువకులను తుని ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కృష్ణను కాకినాడకు, శ్రీనును వైజాగ్‌కు తరలించారు.

సారా కాస్తున్న వ్యక్తి అరెస్టు

రౌతులపూడి: గ్రామ శివారులోని ఏలేరు రిజర్వాయర్ కాలువగట్టుపై సారా కాస్తున్న ఎస్.పైడిపాలకు చెందిన బొంతు సతీష్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. నిందితుడి నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అయినవిల్లి: మోటారుసైకిల్‌పై వెళుతుండగా ఆబోతు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అమలాపురంలో ఓ ప్రైవేటు అస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి హెడ్ కానిస్టేబుల్ వలి తెలిపిన వివరాల ప్రకారం అయినవిల్లి మండలం నేదునూరు బొంతువారిపాలేనికి చెందిన మేడిశెట్టి ముత్యాలరావు (34) ఈ నెల 17న అదే గ్రామంలో మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఆబోతు ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానికులు అమలాపురంలోని ఓ ప్రైవేటు అస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ముత్యాలరావు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వలి తెలిపారు.

పూర్తి నాణ్యతతో ఇంజినీరింగ్ పనులు

అమలాపురం టౌన్: క్షేత్ర స్థాయిలో పనులను పూర్తి నాణ్యతతో చేపట్టాలని పంచాయతీరాజ్ (పీఆర్) ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) టెక్నికల్ అడ్వైజర్ ప్రభాకరరెడ్డి సూచించారు. స్థానిక పంచాయితీ రాజ్ అతిథి గృహంలో మంగళవారం ఇంజినీరింగ్ సిబ్బందికి నిర్వహించిన టెక్నికల్ వర్క్ షాపులో ఆయన మాట్లాడారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీఆర్ ఎస్ఈ మల్లికార్జునరావు మాట్లాడుతూ సీసీ, బీటీ రోడ్ల నిర్మాణంలో మెలకువలపై అత్యంత అవగాహనతో ఉండాలన్నారు. మరో అడ్వైజర్ నరసింహరావు మాట్లాడుతూ సివిల్ యాప్‌లపై అవగాహన కల్పించారు. రోడ్ల నిర్మాణాలు చేపట్టేటప్పుడు తీసుకునే సాంకేతిక జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఏపీపీఆర్‌డీ ఇంజినీర్ల అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్యం రాంబాబు, పీఆర్ ఈఈ కె.చంటిబాబు, డీడీఈ పీఎస్ రాజ్‌కుమార్, ఏఈఈలు కొండా సత్యనారాయణ, పీఆర్ కాంట్రాక్టర్లు ఆంజనేయ రెడ్డి, వీర్రెడ్డి పాల్గొన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఏఐఐబీ టెక్నికల్ అడ్వైజర్

కొట్లాటలో ఒకరి పరిస్థితి విషమం

సీతానగరం: కొట్లాట ఘటనలో అపస్మారక స్థితికి వెళ్లిన ఒక వ్యక్తి పరిస్థితి విషమంగా మారింది. వివరాల్లోకి వెళితే.. సీతానగరం పరిధిలోని లంకూరుకు చెందిన 40 ఏళ్ల దూళ్ల మహాలక్ష్మయ్య, 25 ఏళ్ల ప్రసాద్ లంకభూమిలో సోమవారం పశువులను మేపుకొంటుండగా ఘర్షణ తలెత్తింది. ఈ నేపథ్యంలో ఒకరినొకరు కర్రలతో కొట్టుకున్నారు. ఈ ఘటనలో మహాలక్ష్మయ్య తలపై తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. దీంతో అతడు చనిపోయాడని భావించిన ప్రసాద్ భయంతో వేరే చోటకు కలుపు మందు తాగి పడిపోయాడు. అతడిని అటుగా వస్తున్న మహాలక్ష్మయ్య కుమారుడు చూసి, మరికొందరి సాయంతో సీతానగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. కాగా.. సోమవారం రాత్రి మహాలక్ష్మయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడ్డారు. మంగళవారం ఉదయం లంకభూమికి వెళ్లి వెతకగా దుబ్బులలో అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మహాలక్ష్మయ్య పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. దీనిపై ఎటువంటి సమాచారం అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని కూలిపోయిన విద్యుత్ స్తంభం

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు మినర్వా విద్యాసంస్థల సమీపంలో మంగళవారం త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వెళుతున్న కారు అదుపు తప్పింది. డివైడర్‌పైకి దూసుకుపోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో స్తంభం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. అనంతరం కారు విశాఖపట్నం నుంచి ప్రత్తిపాడు వైపు వచ్చే రోడ్డుపైకి దూసుకుపోయింది. ఆ సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆ కారులో ఐదుగురు ప్రయాణిస్తున్నారు. వారిలో ఒకరికి గాయాలయ్యాయి. బాధితుడిని ఎన్‌హెచ్ మెయింటినెన్స్ సిబ్బంది స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. రోడ్డుపై అడ్డంగా కూలిపోయిన విద్యుత్ స్తంభాన్ని స్థానికులు పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పేకాట శిబిరంపై దాడి

రౌతులపూడి: బంగారయ్యపేట శివారున నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సిబ్బందితో దాడి జరిపి, ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. నిందితుల నుంచి రూ.11,720 స్వాధీనం చేసుకున్నామని కేసు నమోదు చేశామన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురిని తుని సివిల్ జడ్జి కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికీ రూ.10 వేలు జరిమానా విధించారన్నారు.

కారును ఢీకొన్న లారీ

కొవ్వూరు: పట్టణంలోని గామన్ ఇండియా బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద కారును వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తునికి చెందిన గుత్తి వినయ్‌కు చెందిన కారు వెనుక భాగం పాక్షికంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏ విధమైన గాయాలు కాలేదు. దీనిపై పట్టణ పోలీసులకు వినయ్ ఫిర్యాదు చేశారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేసిన వారికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి రెండు రోజుల జైలు, ఏడుగురికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసి పలువురిపై కేసులు నమోదు చేశారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ఐదుగురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, ఏడుగురికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మరో కోర్టులో..

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురికి రెండురోజులు జైలు, 9 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీర భద్రుడు తీర్పు చెప్పారు. తాళ్లరేవు మండలం కోరింగి, పెద్దపూడి, వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

తాళ్లరేవు: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసి రూ.60 వేలు జరిమానా విధించినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి 216లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపుతున్న ఆరుగురిని గుర్తించారు. వారిని కోర్టులో హాజరుపర్చగా, ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్రేమ వివాహం నచ్చక చాకుతో తండ్రి దాడి

- కుమార్తె, అల్లుడితో సహా నలుగురికి గాయాలు
- కోడేరులంకలో ఘటన

పి.గన్నవరం: కుమార్తె ప్రేమ వివాహం చేసుకోవడం ఆ తండ్రికి నచ్చలేదు. దీంతో తన కుమార్తె, అల్లుడు, అతడి తల్లి, చెల్లెలుపై చాకుతో దాడి చేశాడు. ఎల్.గన్నవరం శివారు పశ్చిమ గోదావరి జిల్లా కోడేరులంక గ్రామంలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. గాయపడిన నలుగురు పి.గన్నవరం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆచంట మండలం కోడేరులంక గ్రామానికి చెందిన మైలా రమేష్ పి.గన్నవరం మండలం ఎల్.గన్నవరంలో పీఎంపీగా వైద్యం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆ గ్రామానికి చెందిన కొప్పాడి వరలక్ష్మితో అతడికి పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. దీంతో వరలక్ష్మిని వివాహం చేసుకుంటానని ఆమె తండ్రి వెంకట రమణను రమేష్ అడిగాడు. దానికి అతడు నిరాకరించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కట్టుకాల్వ గ్రామంలోని చర్చిలో రమేష్, వరలక్ష్మి పెళ్లి చేసుకున్నారు. అనంతరం పి.గన్నవరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి తామిద్దరం మేజర్లు కావడంతో పెళ్లి చేసుకున్నామని తెలిపారు. ఆ తర్వాత భర్త ఇంటికి వరలక్ష్మి వెళ్లిపోయింది.



పి.గన్నవరం సీహెచ్‌సీలో బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

అల్లుడి ఇంటికి వచ్చి..

వరలక్ష్మి తండ్రి వెంకట రమణ మంగళవారం రాత్రి కోడేరులంకలోని అల్లుడి ఇంటికి వచ్చాడు. మాట్లాడుకుందామని చెప్పి ఇంట్లోకి వెళ్లాడు. అనంతరం తలుపులకు గడియ పెట్టి రమేష్ తల్లి పద్మపై చాకుతో దాడి చేశాడు. అడ్డువచ్చిన రమేష్, అతడి చెల్లెలు మహేశ్వరి, తన కుమార్తె వరలక్ష్మిని కూడా గాయపరిచాడు. వారు బిగ్గరగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు అక్కడకు చేరుకున్నారు. దీంతో వెంకట రమణ పారిపోయాడు. వరలక్ష్మి చేతికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.